సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 19 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 958 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.106

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.106 పలికింది. కనిష్టంగా రూ.60 పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
35.9°/ 22.3°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘం–1, 3, 7(ఫైనాన్స్, ప్లానింగ్/ వ్యవసాయ/ ఇంజినీరింగ్ శాఖల) సమావేశాలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి స్థాయీ సంఘాలు–2, 4, 5, 6 (గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్య ఆరోగ్య/ సాంఘిక సంక్షేమం/ స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు) సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా స్థాయీ సంఘాల చైర్మన్ల అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయి.

క్రీడలకు ప్రాధాన్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ రంగజనార్దన

అనంతపురం: యూనివర్సిటీ పరిధిలో క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు జేఎన్‌టీయూ (ఏ) వైస్ చాన్సలర్ జింకా రంగజనార్దన తెలిపారు. వర్సిటీలో మంగళవారం అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరంలో క్రీడాపోటీల నిర్వహణపై చర్చించారు. క్రీడలతో పాటు యోగా తప్పనిసరిగా నిర్వహించాలని వైస్ చాన్సలర్ ఆదేశించారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో మెన్, ఉమెన్ ఫిజికల్ డైరెక్టర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు వర్సిటీ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. 300 మంది క్రీడాకారులు సౌత్ జోన్, ఆలిండియా స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. సమావేశంలో జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణకాంతి పాల్గొన్నారు.

పదివేల కాంతులు

'జగనన్న తోడు'
ఏడో విడత నిధులు విడుదల

- జిల్లాలో 19,546 మంది ఖాతాల్లోకి రూ.21.05 కోట్లు
- వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద 19,487 మందికి రూ.43.20 లక్షలు జమ
- చిరువ్యాపారుల ఇంట సంతోషకాంతులు



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: చిరువ్యాపారి మోము వికసించింది. సెల్‌ఫోన్‌లో మెసేజ్ చూడగానే 'పదివేల' కాంతులతో వెలిగిపోయింది. ''హమ్మయ్యా... పెట్టుబడి కోసం ఇక ఎవరి వద్దా చేతులు చాచాల్సిన పనిలేదు. వడ్డీ వ్యాపారి ఇళ్ల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. దర్జాగా వ్యాపారం చేసుకుని హాయిగా బతికేయొచ్చు''అన్న ధీమా కనిపించింది. చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 'జగనన్న తోడు' పథకం ఏడో విడత మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఒక్కో లబ్ధిదారుని ఖాతాల్లో రూ.10 వేలు జమ కాగానే వారంతా సంతోషంలో మునిగిపోయారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎల్‌డీఎం రమణ కుమార్, చిరు వ్యాపారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 'జగనన్న తోడు' పథకం కింద 19,546 మందికి విడుదలైన రూ.21.05 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు.

వడ్డీ బాధల నుంచి విముక్తి

చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు వడ్డీ బాధల నుంచి విముక్తి కల్పించడమే 'జగనన్న తోడు' లక్ష్యమని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఈ పథకం కింద చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు నాలుగో ఏడాది ఏడో విడతలో భాగంగా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరైందన్నారు. లబ్ధిదారులు వ్యాపారాభివృద్ధికి నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 'జగనన్న తోడు' పథకానికి 19,546 మంది అర్హత సాధించగా, ఇందులో పట్టణ ప్రాంతాల్లో 5,997 మందికి రూ.6.45 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 13,549 మంది లబ్ధిదారులకు రూ.14.59 కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. అలాగే గత ఆరు విడతల్లో 'జగనన్న తోడు'లో రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 19,487 మంది లబ్ధిదారులకు ఖాతాల్లో వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.43.20 లక్షలు జమ చేశామన్నారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 6,687 మందికి రూ.14.82 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 12,800 మంది ఖాతాల్లో రూ.23.38 లక్షలు జమైందన్నారు.

ఇలాంటి పథకాలు దేశంలోనే ఎక్కడా లేవు

రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశంలోనే ఎక్కడా లేవని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి అన్నారు. 'జగనన్న తోడు' కార్యక్రమం అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో టీడీపీ నాయకులు వడ్డీ వ్యాపారాలు చేస్తూ చిరు వ్యాపారులను జలగల్లా పట్టి పీల్చేశారన్నారు. అప్పట్లో కాల్ మనీ కేసులు కూడా ఎన్నో బయట పడ్డాయన్నారు. తన సుదీర్ఘ పాద యాత్రలో చిరువ్యాపారుల కష్టాలు చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 'జగనన్న తోడు' పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వడ్డీ లేని రుణాలు అత్యధికంగా ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. రూ.10 వేల ఆర్థిక సాయం సంప్రదాయ కళాకారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కంతులు సకాలంలో చెల్లించిన వారికి మళ్లీ రుణాలు మంజూరవుతాయన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే లబ్ధి చేకూరుతుందన్నారు.

వడ్డీ బాధలు తొలిగాయి



'జగనన్న తోడు' పథకంతో మాలాంటి చిరు వ్యాపారులకు వడ్డీ బాధలు తప్పాయి. ఇప్పటి వరకూ నేను మూడు సార్లు రుణాలు తీసుకున్నా. నా వ్యాపారానికి 'జగనన్న తోడు' రుణం ఎంతగానో ఉపయోగపడింది. వ్యాపారంతో వచ్చిన ఆదాయంతో ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నా.

– షబాన, చిల్లర అంగడి, కొత్తచెరువు

వడ్డీ మొత్తం ఖాతాల్లో జమైంది



'జగనన్న తోడు' పథకం కింద నాలుగోసారి రుణం తీసుకుంటున్నా. సకాలంలో కంతులు చెల్లించిన వెంటనే వడ్డీ మొత్తం నా ఖాతాలో జమ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు చేస్తున్న ఈ సాయం మరువలేనిది. 'జగనన్న తోడు'తో చిరువ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుంది. సీఎం రుణం తీర్చుకోలేనిది.

–లక్ష్మీదేవి, గాజుల వ్యాపారి, పుట్టపర్తి

మాకు తోడుగా నిలిచారు



మాలాంటి చిరు వ్యాపారుల గురించి ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. నిజంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు తోడుగా నిలిచారు. నా వ్యాపారానికి ఈ రుణం ఎంతగానో ఉపయోగపడుతుంది. పెట్టుబడి కోసం ఎవరి వద్దా చేయి చాచాల్సిన పనిలేదు. వడ్డీ బాధలు తప్పడంతో మా రెక్కల కష్టం మాకే దక్కుతుంది.

– సరస్వతి, పండ్ల వ్యాపారి, అమగొండపాళ్యం

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మరవకొత్తపల్లి వద్ద భూముల రీ సర్వే పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి చక్రధర్ బాబు

చిలమత్తూరు: భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఏపీ జెన్‌కో ఎండీ, జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు (ఐఏఎస్) రెవెన్యూ సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని మరవకొత్తపల్లి గ్రామ పొలాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను తనిఖీ చేశారు. సర్వే ఎలా సాగుతోంది.. రైతుల నుంచి సహకారం ఎలా ఉందని అధికారులను ఆరా తీశారు. రీసర్వే ఉపయోగాలను రైతులకు వివరించాలన్నారు. భూ తగాదాలు ఉన్న చోట శాంతియుతంగా చర్చించుకొని సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. హద్దులు కచ్చితంగా ఉండాలని, రీ సర్వే వల్ల భూ సమస్యలకు పరిష్కారం లభించాలి గానీ, సమస్యలకు కారణం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ.. రీసర్వే తర్వాత ఇదివరకు ఉన్న సర్వే నంబర్ల స్థానంలో కొత్త నంబర్లు కేటాయిస్తారన్నారు. అనంతరం పంట సాగుపై రైతులతో ఆరా తీశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, తహసీల్దార్ నాగరాజు, డీటీ యూనిస్, సర్వేయర్ సురేష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందాలి

గోరంట్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన గోరంట్ల మండల పరిధిలోని బూదిలి గ్రామ సచివాలయంలో సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన 'జగనన్న సురక్ష' శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ చేతన్‌తో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, ఉద్యోగుల పనితీరును తెలుసుకున్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్ యార్డు అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎల్‌డీఓ శివారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి 'సంక్షేమం' ఆరా తీయాలి

- 'జగనన్న సురక్ష'ను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలి
- గ్రీవెన్స్‌లను మరింత నాణ్యతగా పరిష్కరించాలి
- జిల్లా స్పెషల్ ఆఫీసర్ కేవీఎన్ చక్రధర్ బాబు ఆదేశం





సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ చక్రధర్ బాబు, చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'జగనన్నకు చెబుదాం' కింద వస్తున్న గ్రీవెన్స్‌లను మరింత నాణ్యతగా పరిష్కరించాలని, అలాగే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీయాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 'జగనన్నకు చెబుదాం', 'జగనన్న సురక్ష' కార్యక్రమాల అమలుపై కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధర్ బాబు మాట్లాడుతూ... జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలు జిల్లాలో చక్కగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమాల అమలుపై మండలస్థాయి అధికారులు నుంచి నివేదిక కచ్చితంగా తీసుకోవాలన్నారు. 'జగనన్న సురక్ష' కింద అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో పాల్గొనేలా చూడాలన్నారు. మండల స్థాయిలోనే గ్రీవెన్స్‌లకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. 'జగనన్న సురక్ష' క్యాంపుల్లో అందే సమాచారాన్ని ఆయా శాఖల పనితీరు మెరుగుపరుచుకోవడానికి వినియోగించుకోవాలన్నారు. అలాగే ఈ సర్వేతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అన్ని వివరాలు సమగ్రంగా సేకరిస్తే వచ్చే 5, 10 ఏళ్లు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లాకు మొదటి స్థానం

జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద జిల్లాకు సంబంధించి 2,578 గ్రీవెన్స్‌లు రాగా 2,280 గ్రీవెన్స్‌లు (88 శాతం) పరిష్కరించారని, దీంతో జిల్లా రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు తెలిపారు. ఇందుకు కృషి చేసిన జిల్లా యంత్రాంగాన్ని, కలెక్టర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, జగనన్న సురక్షలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 3.08 లక్షల టోకెన్లు ఇచ్చామని, ఇందులో 90శాతానికి పైగా సర్వీస్ రిక్వెస్ట్‌లు నమోదై ఉన్నాయని ప్రత్యేకాధికారికి వివరించారు. ప్రతి మండలానికి ఒక స్పెషలాఫీసర్‌ను నియమించామని, మంగళవారం 38 సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ ఈ రషీద్‌ఖాన్, డీసీహెచ్‌ఎస్ ఎంటీ నాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, డ్వామా పీడీ రామాంజనేయులు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, భూగర్భజల వనరుల శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి సుభదాస్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 వేల నోటా.. మేం తీసుకోం!

✓ గోరంట్ల మండలం బూడిదగడ్డపల్లికి చెందిన ఓ రైతు మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపులో ఎరువులు కొనుగోలు చేసి రూ. 2 వేల నోటు ఇవ్వగా దుకాణ యజమాని అంగీకరించలేదు. చేసేది లేక రైతు వేరే షాపునకు వెళ్లాడు. మరో రెండు షాపుల్లోనూ ఇదే పరిస్థితి ఎదురుకావడంతో ఎరువులు కొనుగోలు చేయకుండానే ఇంటిదారి పట్టాడు.

✓ కదిరి వాణీవీధికి చెందిన ఓ వ్యక్తి వారం క్రితం కదిరి రైల్వే స్టేషన్‌కు వెళ్లి విజయవాడకు వెళ్లేందుకు టికెట్ తీసుకుని రూ. 2 వేలు నోటు ఇచ్చాడు. బుకింగ్‌లో ఉన్న వ్యక్తి 'రూ. 2 వేలు నోట్లు తీసుకోలేమని చెప్పడంతో ఇంటికి వెళ్లి మళ్లీ డబ్బు తెచ్చుకున్నాడు.



- పెద్ద నోటును తిరస్కరిస్తున్న వ్యాపారులు
- రైల్వే, ఆర్టీసీ టికెట్ బుకింగ్‌కు అంగీకరించని సిబ్బంది
- ఆర్బీఐ క్లారిటీ ఇచ్చినా అంతటా ఇదే తీరు

కదిరి: గత రెండు నెలలుగా ఎవరి నోట విన్నా రూ. 2 వేలు నోటు మాటే వినబడుతోంది. తరచూ బ్యాంకులకెళ్లి లావాదేవీలు చేసే వారికి రూ.2 వేల కష్టాలు పెద్దగా లేక పోయినా, కూలీలు, పేద, దిగువ మధ్య తరగతి వారికి మాత్రం రూ.2 వేల కష్టాలు కంటతడి పెట్టిస్తున్నాయి. ఎక్కడికెళ్లినా..ఏం కొనుగోలు చేసినా వ్యాపారులు రూ.2 వేల నోట్లు మాత్రం వద్దని చెప్పడంతో చేసేది లేక కొనుగోలు చేసిన సరుకులు సైతం తిరిగి వెనక్కు ఇచ్చే పరిస్థితులు చాలామందికి ఎదురవుతున్నాయి.

ఆర్‌బీఐ ఏం చెప్పింది?

భారతీయ రిజర్వ్ బ్యాంకు రూ. 2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు మే 19న ప్రకటించింది. అయితే రూ. 2 వేల నోట్లు చెల్లుబాటు కావు..అని మాత్రం ఎక్కడా చెప్పలేదు. ఇకపై రూ.2 వేల నోట్లను కష్టమర్లకు ఇవ్వద్దని ఆర్‌బీఐ బ్యాంకులకు సూచించింది. ప్రజలు కూడా తమ వద్ద ఉన్న రూ. 2 వేల నోట్లను ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీలోపు బ్యాంకుల్లో మార్చుకోవాలని సూచించింది. అంతవరకూ ఈ నోట్లు మార్కెట్‌లో చెల్లుబాటు అవుతాయని ఆర్‌బీఐ స్పష్టంగా పేర్కొంది. అయితే కొన్ని షాపింగ్ మాల్స్, చాలా వరకూ దుకాణాల్లో, సినిమా థియేటర్లలో, కొన్ని బస్సుల్లోనూ రూ. 2 వేల నోట్లు చెల్లవంటూ తిరస్కరిస్తున్నారు. ఆఖరుకు రైల్వే స్టేషన్ బుకింగ్ కౌంటర్‌లో కూడా రూ.2 వేల నోట్లను తిరస్కరిస్తే ఎలా? అని జనం మండిపడుతున్నారు.

బ్యాంకులో అకౌంట్ లేకున్నా మార్చుకోవచ్చు

రూ.2 వేల నోట్లు మార్చుకోవడానికి బ్యాంకు ఖాతా తప్పనిసరి కాదు. ఖాతా లేకపోయినా .. రోజుకు 10 నోట్ల చొప్పున ఏ బ్యాంకులోనైనా మార్చుకోవచ్చు. సెప్టెంబర్ 30 వరకూ ఈ అవకాశం ఉంది. ఒకేసారి రూ.50 వేలు ఆపైన నోట్లు మార్చుకోవాల్సి వస్తే బ్యాంకు ఖాతా అవసరం. పెద్ద మొత్తంలో జమచేయాల్సి వస్తే పాన్ కార్డు సైతం చూపించాల్సి ఉంటుంది.

చెల్లవని చెబుతున్నారు



ఇప్పుడు ఎక్కడా రూ.2 వేల నోట్లు తీసుకోవడం లేదు. ఇంకా చెల్లుబాటులోనే ఉంది కదా..అని అడిగితే మా దగ్గర చెల్లవు..అని చెబుతున్నారు. అకౌంట్ లేకపోయినా బ్యాంకులకు వెళ్లి మార్చుకోవచ్చనే విషయం చాలామందికి తెలీదు. అందుకే జనం ఇబ్బంది పడుతున్నారు.

–కొట్టం ఆదినారాయణ, కదిరి

సెప్టెంబర్ 30 వరకూ గడువు



రూ.2 వేల నోట్లను మార్చుకోవడానికి ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకూ గడువు ఉంది. ఏ బ్యాంకులోనైనా మార్చుకోవచ్చు. బ్యాంకు ఖాతా కూడా ఉండాల్సిన అవసరం లేదు. రూ.50 వేలుపైబడి రూ.2 వేల నోట్లు మార్చుకోవాల్సి వస్తే ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది.

– రవీంద్రారెడ్డి, ఏపీజీబీ రీజనల్ మేనేజర్, కదిరి

తమ్ముళ్లకే 'పల్లె' శఠగోపం!

సాక్షి, పుట్టపర్తి: మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పల్లె రఘునాథరెడ్డి సొంత పార్టీ నేతల చెవిలో పూలు పెట్టాడు. 2019 ఎన్నికల సమయంలో చేబదులుగా సొంత పార్టీ నేతల నుంచి రూ.లక్షల్లో నగదు తీసుకుని వాటిని ఇవ్వకుండా తప్పించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. చేసేది లేక సదరు తెలుగు తమ్ముళ్లు పల్లె రఘునాథరెడ్డిపై బహిరంగ విమర్శలకు దిగారు.

బాధితుల కథనం మేరకు...

గత ఎన్నికల సమయంలో ఖర్చుల కోసమంటూ పల్లె రఘునాథరెడ్డి టీడీపీలోని బీసీ వర్గానికి చెందిన పీసీ గంగన్న, ఒ.లక్ష్మీనారాయణ వద్ద రూ.25 లక్షల చొప్పున రూ.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఈ మొత్తాన్ని వారం రోజుల్లో తిరిగి చెల్లిస్తానని చెప్పారు. అయితే ఆ ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన పల్లె రఘునాథరెడ్డి వారి వద్ద అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించలేదు. దీంతో నెలరోజుల తర్వాత వారే పల్లె రఘునాథరెడ్డి వద్దకు వెళ్లి అడగ్గా.. రూ.25 లక్షల చొప్పున రెండు చెక్కులు రాసి ఇచ్చారు. అయితే బ్యాంకుకు వెళ్లి డ్రా చేసుకోవాలని ప్రయత్నించగా.. రెండు చెక్కులు చెల్లలేదు. తనకిచ్చిన చెక్కుకు సంబంధించి సదరు బ్యాంకు ఖాతాలో నగదు లేదని అధికారులు చెప్పారని పీసీ గంగన్న, ఇచ్చిన చెక్కులో సంతకం మ్యాచ్ కాలేదని బ్యాంకర్లు చెక్కు తిరస్కరించారని లక్ష్మీనారాయణ తెలిపారు. ఆ తర్వాత వెళ్లి పల్లె రఘునాథరెడ్డిని డబ్బుల విషయమై నిలదీసినట్లు బాధితులు వివరించారు. 'డబ్బులు కావాలంటే వేచి ఉండాలి. పార్టీ లో కొనసాగాలి. లేదంటే మీ ఇష్టం' అని పల్లె రఘునాథరెడ్డి సమాధానం ఇచ్చినట్లు బాధితులు వాపోతున్నారు.



లక్ష్మీనారాయణకు ఇచ్చిన చెక్కులో మ్యాచ్ కాని సంతకం



బౌన్స్ అయిన గంగన్నకు ఇచ్చిన చెక్కు

తప్పించుకు తిరుగుతున్న 'పల్లె'

చెక్కులు బౌన్స్ అయ్యాయని భావించిన పీసీ గంగన్న, లక్ష్మీనారాయణ లాయర్లను ఆశ్రయించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి నోటీసులు ఇచ్చారు. సరైన చెక్కులు ఇవ్వాలని, లేనిపక్షంలో నగదు రూపేణా బకాయిలు చెల్లించాలని కోరుతూ నోటీసులు పంపించారు. కానీ ఆ నోటీసులను తీసుకోకుండా పల్లె రఘునాథరెడ్డి తప్పించుకు తిరిగారని బాధితులు చెబుతున్నారు. లాయర్లు, పోలీసులను అడ్డు పెట్టుకుని తమ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీల పార్టీ అని చెప్పుకుంటున్న టీడీపీలో బీసీలమైన తమకు అన్యాయం జరిగినా పార్టీ పెద్దలు ఏ ఒక్కరూ నోరుమెదపకపోవడమ దుర్మార్గమంటున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

నా చెక్కులు మిస్ అయ్యాయి



2019 ఎన్నికల సమయంలో నా చెక్కులు రెండు మిస్ అయ్యాయి. వాటినే పీసీ గంగన్న, లక్ష్మీనారాయణ తీసుకున్నట్లు అనుమానం వచ్చింది. ఆరా తీయగా వారు ఒక్కో చెక్కులో రూ.25 లక్షలు రాసుకుని బ్యాంకుకు వెళ్లి నా డబ్బు కాజేయాలని చూసినట్లు సమాచారం వచ్చింది. అంతేగానీ చెల్లని చెక్కులు నేను ఎవరికీ ఇవ్వలేదు. నేను ఎవరితో అప్పు కూడా చేయలేదు. నాకు ఆ అవసరం కూడా లేదు. అనవసరంగా కేసులకు వెళ్తే భయపడేది లేదు. – పల్లె రఘునాథరెడ్డి

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో 20 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న సీఐ కాంతారెడ్డి

పావగడ: తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరంగపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై 20 గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీరంగపురం నివాసి రైతు మంజునాథ్ ఓ విద్యుత్ స్తంభం పక్కనే గొర్రెల షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం అర్ధ రాత్రి జోరుగా కురిసిన గాలీవానకు విద్యుత్ వైర్లు తెగి షెడ్ మీద పడ్డాయి. ఆ సమయంలో షాక్‌కు గురై 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

కుక్కల దాడిలో 35 గొర్రె పిల్లలు..



మృతి చెందిన గొర్రె పిల్లలు

గార్లదిన్నె: 35 గొర్రెపిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం జంబులదిన్నెకు చెందిన గొటుకూరు రామాంజనేయులు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 35 గొర్రె పిల్లలను గూడు కింద వదిలి, తనకున్న 300 గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. సాయంత్రం గూడు వద్దకు చేరుకుని చూడగా 35 గొర్రె పిల్లలూ మృతి చెంది ఉన్నాయి. వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందినట్లు అక్కడి అడుగు జాడలు స్పష్టం చేశాయి. ఈ ఘటనతో దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు కాపరి వాపోయాడు.

వీధి కుక్కల దాడిలో బాలికకు గాయాలు

పుట్టపర్తి టౌన్: వీధి కుక్కల దాడిలో బాలికకు గాయాలైన ఘటన కొత్తచెరువులోని గాంధీ నగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గాంధీనగర్‌కు చెందిన మనోహర్, అనిత దంపతుల కుమార్తె శౌర్య వీధిలో ఆడుకుంటోంది. ఈ క్రమంలోనే ఆమెపై ఎనిమిది కుక్కలు దాడికి దిగాయి. స్థానికులు శునకాలను తరిమికొట్టి శౌర్యను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం శౌర్య కోలుకుంటోంది. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని వీధి కుక్కల నుంచి కాపాడాలని స్థానికులు కోరారు.

పంటలకు ముందస్తు 'మద్దతు'

- వేరుశనగకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,377 ఖరారు
- వరి రూ.2,203, కంది రూ.7 వేలు, పత్తికి రూ.7,020
- వేరుశనగ, పత్తి, పెసరకు గతేడాది కన్నా పెరిగిన ధర
- ఎంఎస్‌పీ కన్నా మార్కెట్‌లో ధర తక్కువైతే కొనుగోళ్లు



అనంతపురం అగ్రికల్చర్: రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం పంటలకు ముందస్తుగానే మద్దతు ధరలు ప్రకటించింది. దీని వల్ల ఏ పంట వేసుకుంటే గిట్టుబాటు అవుతుందో రైతు ఒక అంచనాకు వస్తారు. పంటల వారీగా పెడుతున్న పెట్టుబడులు, వస్తున్న దిగుబడులు, మార్కెట్‌లో పలుకుతున్న ధరలు, రైతులకు లభిస్తున్న నికరాదాయం... తదితర అన్ని లెక్కలూ పరిగణనలోకి తీసుకుని జగన్ సర్కారు నాలుగేళ్లుగా ముందస్తుగానే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. అంతకుముందు పంట చేతికొచ్చే సమయం లేదా సెప్టెంబర్, అక్టోబర్‌లో చాలా ఆలస్యంగా ఎంఎస్‌పీ ప్రకటించే పరిస్థితి ఉండేది. దీని వల్ల రైతులకు ఏ విధమైన ప్రయోజనమూ ఉండేది కాదు.

15 పంటలకు ఎంఎస్‌పీ

ఖరీఫ్–2023లో 15 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించారు. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రధానంగా తీసుకుంటే వేరుశనగ, కందులు, మొక్కజొన్న, పత్తి లాంటి ముఖ్యమైనవి. వేరుశనగ విషయానికి వస్తే గతేడాది కన్నా క్వింటాలుపై రూ.527 పెంచడం విశేషం. అలాగే పత్తికి రూ.540, కందులకు రూ.400, మొక్కజొన్నకు రూ.128, వరిధాన్యంపై రూ.143, అత్యధికంగా నువ్వులపై రూ.805, పెసలుపై రూ.803 ప్రకారం పెంచారు. సజ్జలు, రాగులు, జొన్నల మీద కూడా రూ.150 నుంచి రూ.250 పెంచి ఇవ్వడం విశేషం. 2014–18 మధ్యకాలంలో క్వింటాలుపై ఒక్కసారి కూడా రూ.200 మించి పెంచిన దాఖలాలు లేవు.

ఎంఎస్‌పీ లేకుంటే కొనుగోళ్లు

పంట చేతికొచ్చిన సమయంలో బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కన్నా తక్కువగా ఉంటే... వరి, వేరుశనగ, కంది, పప్పుశనగ, మొక్కజొన్న, కొర్రలు, రాగులు, సజ్జలు, పత్తి తదితర పంట ఉత్పత్తులను ఆర్‌బీకే వేదికగా కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఆదేశాలు ఇస్తోంది. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ సహకారంతో పౌరసరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఏపీ సీడ్స్, ఆయిల్‌ఫెడ్, కాటన్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు చేసి సొమ్మును సకాలంలో రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. అలాగే ధరల స్థిరీకరణ నిధి, మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద కూడా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంతో రైతులకు ప్రయోజనం కలుగుతోంది. పండిన పంట ఉత్పత్తులను ఎంఎస్‌పీ కన్నా తక్కువకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అమ్ముకోవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచించారు.

గతేడాది, ఈ ఏడాది పంటల వారీగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపాయల్లో

పంట	2022లో	2023లో	పెరిగిన ధర
వరి (సాధారణం)	2,040	2,180	143
వరి (ఏ-గ్రేడు)	2,060	2,203	143
వేరుశనగ	5,850	6,377	527
కందులు	6,600	7 వేలు	400
పత్తి (మీడియం)	6,080	6,620	
పత్తి (పొడవు రకం)	6,380	7,020	640
మొక్కజొన్న	1,962	2,090	128
జొన్న (మాల్దండి)	2,990	3,225	235
జొన్న (హైబ్రిడ్)	2,970	3,180	210
సజ్జలు	2,350	2,500	150
రాగులు	3,578	3,846	268
పెసలు	7,755	8,558	803
మినుములు	6,600	6,950	350
నువ్వులు	7,830	8,635	805
నైగర్‌సీడ్ (ఒడిసెలు)	7,257	7,734	447
పొద్దుతిరుగుడు	6,400	6,760	360
సోయాబీన్	4,300	4,600	300

మద్దతు ధరతో మొక్కజొన్న విక్రయం



బహిరంగ మార్కెట్‌లో ఈ ఏడాది మొక్కజొన్నకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు రైతులకు ఉపయోగపడ్డాయి. ఇటీవల నేను పండించిన 92 క్వింటాళ్లు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అమ్మాను. నెల రోజుల్లోపు నా బ్యాంకు ఖాతాలో రూ.1,81,485 జమ అయింది. కచ్చితమైన తూకాలు, సకాలంలో డబ్బు ఇస్తుండటం వల్ల కొనుగోలు కేంద్రాల వల్ల రైతులకు ప్రయోజనం ఉంటుంది. – వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, వేములపాడు

రాగి సాగుపై దృష్టి సారించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

ఎన్పీకుంట: రాగి పంట సాగుపై రైతులు దృష్టి సారించాలని కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కే.వేమన, డాక్టర్ చంద్రాయుడు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని వెలిచలమల, గొకనపేట, టీ.ఎస్.పల్లి, మరి కొమ్మదిన్నె, పి.కొత్తపల్లి, పెడబల్లి పంచాయతీలలో సాగు చేసిన వేరుశనగ పంటను ఏడీఏ సత్యనారాయణతో కలిసి వారు పరిశీలించారు. బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటలో పొగాకు లద్దెపురుగు, శనగ పచ్చపురుగు, వేరు పురుగు, ఆకుపచ్చ దోమ, వేరుకుళ్లు తెగులు, ఆకు పచ్చ తెగులు గుర్తించారు. వర్షాధారం కింద సాగు చేసిన పంటలో వేరుపురుగు, వేరుకుళ్లు గుర్తించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ చీడ పీడల నివారణకు ఎకరాకు ఇమామెక్టిమ్ బెంజోయెట్ 80 గ్రా., హెక్సాకొనజోల్ 400మి.లీ పిచికారి చేయాలని సూచించారు. బెట్ట వేరుశనగలో లీటరు నీటికి 20 గ్రా. 19:19:19 కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వయ్యారి భామ, గడ్డి చేమంతి, గరుగులాంటి వెడల్పు ఆకులు గల కలుపు మొక్కలను పీకివేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాగి సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. విత్తన మోతాదు, సాగు విధానం, ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి గ్రామంలో కనీసం 25 ఎకరాలలో రాగి పంట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆసక్తి కలిగిన రైతులకు ప్రభుత్వమే సబ్సిడీ కింద ఆర్బీకేల ద్వారా రాగులు అందిస్తుందని చెప్పారు. అంతేకాక పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. సాగు చేసిన ప్రతి పంటకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరెడ్డి, ఏఈఓ శిరీష, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి నాయకత్వం వహించాలి

- హెచ్‌ఎంలకు ప్రాథమిక విద్య ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి సూచన



మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి



హాజరైన ప్రధానోపాధ్యాయులు

రాప్తాడురూరల్: విద్యార్థులతో పాటు పాఠశాల అభివృద్ధి చెందాలంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులు నాయకత్వం వహించాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు (ఆర్జేడీ) వెంకట కృష్ణారెడ్డి సూచించారు. లీడర్ షిప్ అంశంపై ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఆరు రోజుల రీజనల్ స్థాయి శిక్షణ మంగళవారం అనంతపురంలో ప్రారంభమైంది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ఎంపిక చేసిన 200 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి హాజరై.. శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేందుకు వీలుగా మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలు బడి, జూనియర్ కళాశాలల్లోనే ఉండేలా చర్యలు తీసుకుందన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రతి తరగతి గదిలోనూ ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలు ఏర్పాటు చేసి డిజిటల్ బోధన అందిస్తోందన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. విద్యావ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే హెచ్‌ఎంలు... ఉపాధ్యాయులను, విద్యార్థులను, తల్లిదండ్రులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. గుణాత్మక విద్య, వినూత్న బోధన, ఆలోచనలకు నాంది పలికేలా ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా అగ్రగామి సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (అహ్మదాబాద్)తో అవగాహన ఒప్పందం చేసుకుందన్నారు. సమావేశంలో రాష్ట్ర పరిశీలకులు నితిన్, అనంతపురం డీఈఓ ఎం.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గొడనకుంటలో ఎలుగు బంట్ల హల్‌చల్



గొడనకుంటలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

అమరాపురం: మండలంలోని గొడనకుంట గ్రామంలో రెండు రోజుల నుంచి ఎలుగుబంట్లు హల్‌చల్ చేస్తున్నాయి. స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించడానికి యత్నిస్తుండడంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామస్తుడు కరియప్ప ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఎలుగుబంట్ల సంచారం రికార్డయింది. అటవీ శాఖాధికారులు భల్లూకాలను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీ-ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోని బీ-ఫార్మసీ మొదటి సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్, ఫార్మా-డీ నాలుగు, ఐదో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు, ప్రీ-పీహెచ్‌డీ (2021 అడ్మిట్ అయిన బ్యాచ్) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను http://jntuaresults.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తనకల్లు: స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద పురుగుల మందు తాగి మద్దిగొల్ల చిన్న నరసింహులు (54) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. దళితవాడకు చెందిన చిన్న నరసింహులు చర్మకారుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. 2017లో మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించడంతో అప్పట్లో అతనిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చాడు. ప్రస్తుతం కేసు అనంతపురం కోర్టులో విచారణ దశలో ఉంది. ఈ కేసులో తనకు శిక్ష పడుతుందేమోనని భయపడి ఆసుపత్రి దగ్గర పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

చిన్నారులకు టీటీడీ కథల పోటీలు

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఈ నెల 30న కథల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా టీటీడీ ధర్మప్రచార పరిషత్తు ప్రతినిధులు బాబు, పండిట్ వేణు తెలిపారు. నగరంలోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా 'కథ చెపుతారా..ఊ కొడదాం' పేరుతో పోటీలు ఉంటాయి. మొదటి విభాగంలో 10 ఏళ్ల లోపు చిన్నారులు, రెండో విభాగంలో 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు పోటీ పడాల్సి ఉంటుంది. ఆధ్యాత్మిక, సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే కథలను చిన్నారులు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒక్కో చిన్నారికి 5 నిముషాల సమయం కేటాయిస్తారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు చిన్నారులను ప్రోత్సహించి, సనాతన వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను నిర్వాహకులు కోరారు.

రెండు జింకల స్వాధీనం



ఫారెస్ట్ సిబ్బందికి జింకను అందజేస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో స్థానికులకు పట్టుబడిన రెండు జింకలను ఫారెస్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో దిగువ తండాలో ఓ జింక పిల్ల, నుసికొట్టాలలో మరో జింక కుక్కల దాడికి గురై గాయపడ్డాయి. గుర్తించిన స్థానికులు వాటిని తీసుకెళ్లి కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుధాకర్ ద్వారా అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఎలాంటి హాని తలపెట్టకుండా వన్య ప్రాణులను అందజేసిన స్థానికులను అటవీ శాఖ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు స్వల్ప అస్వస్థత



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ వేణుకార్తికేయ, నాయకులు

శెట్టూరు: మండలంలోని కనుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఏడో తరగతి చదువుతున్న 15 మందికి శరీరంపై చిన్నపాటి దద్దుర్లు లేచి, దురదతో ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ హరిత సాయంతో ప్రథమ చికిత్స అందజేయించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో శెట్టూరు పీహెచ్‌సీకి తరలించారు. పిల్లల తల్లిదండ్రులకు విషయం ఆలస్యంగా తెలవడంతో ఆస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. విద్యార్థులకు డాక్టర్ వేణుకార్తికేయ చికిత్స అందించారు. పిల్లలకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. పాఠశాలలో ఫ్లోరింగ్ పనులు జరుగుతుండటంతో ఏడో తరగతి విద్యార్థులు ఆరుబయట చింత చెట్టు కింద కూర్చొన్నారని, డస్ట్ అలర్జీ వల్ల శరీరంపై దద్దుర్లు వచ్చి ఉంటాయని అనుమానాలు వ్యక్తమయ్యాయి. విషయం తెలుసుకున్న డీఈఓ సాయిరాం ఫోన్‌లో డాక్టర్‌తో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. ఎంఈఓ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, నాయకులు హరినాథరెడ్డి, కనుకూరు సర్పంచ్ వెంకటేశులు, స్కూల్ కమిటీ చైర్మన్ కిష్టప్ప తదితరులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. చికిత్స అనంతరం విద్యార్థులను ఇంటికి పంపారు.

స్టాఫ్‌నర్సుల నియామకానికి వేళాయె

- 313 పోస్టుల భర్తీకి చర్యలు
- ఈ నెల 21, 22న కౌన్సెలింగ్



కడపలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్టాఫ్‌నర్సుల నియామకాలను పెద్ద ఎత్తున చేపడుతోంది. జోన్–4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో ఇప్పటికే కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామకాలు భారీగా జరిగాయి. మరోమారు అధిక సంఖ్యలో జరగనున్నాయి.

మొత్తం 11,120 దరఖాస్తులు

ఈ ఏడాది ప్రారంభం నుంచే ప్రభుత్వం పెద్దసంఖ్యలో స్టాఫ్ నర్సు నియామకాలను చేపట్టింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి మొత్తం 11,120 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నిబంధనల ప్రకారం జనవరి నుంచి ఏప్రిల్ వరకు మొత్తం 286 మంది అర్హులకు స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలిచ్చింది. వారంతా తమకు కేటాయించిన స్థానాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

తాజాగా 313 నియామకాలు

ప్రభుత్వం మరోమారు స్టాఫ్‌నర్సు నియామకాలను చేపడుతోంది. ఇప్పటికే వచ్చిన 11,120 దరఖాస్తుల నుంచి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి.. రాయలసీమలోని 8 జిల్లాల్లో గల ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 313 మంది స్టాఫ్‌నర్సులను నియమించనున్నారు. మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) పరిధిలో 90, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆధ్వర్యంలో నంద్యాల మెడికల్ కాలేజీ, తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రికి సంబంధించి 149, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో 74.. మొత్తం 313 నియామకాలను చేపడుతున్నారు.

నిబంధనల మేరకు నియామకాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 21, 22 తేదీల్లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు నియామకాలను చేపడుతున్నాం. ఇందుకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను కడప వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో నిర్వహిస్తాం.
– డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్, రీజినల్ డైరెక్టర్, వైద్య, ఆరోగ్య శాఖ

నారాయణలో అనుమతి లేని తరగతుల నిలిపివేత



తరగతి గదికి తాళం వేసిన డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓ జయచంద్ర

పెనుకొండ/ప్రశాంతినిలయం: కొత్తచెరువు మండల కేంద్రంలోని నారాయణ పాఠశాలలో 8, 9,10 తరగతులను మంగళవారం నిలిపివేసినట్లు డీవైఈఓ రంగస్వామి తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఎంఈఓ జయచంద్రతో కలిసి పాఠశాలను తనిఖీ చేశామన్నారు. 8, 9, 10 తరగతుల నిర్వహణకు అనుమతులు లేవని గుర్తించామన్నారు. దీంతో ఆయా తరగతి గదులకు తాళం వేసినట్లు ఆయన వివరించారు.